

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సీతారామారావు



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కోనే సీతారామారావు ఎన్నికయ్యారు. ఎన్నికలు శనివారం జరగగా ఆయన 240 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 615 ఓట్లు పోలవగా 385 ఓట్లు సీతారామారావుకు రాగా సమీప ప్రత్యర్థి అల్లినేని విజయ్‌కుమార్‌కు 145 ఓట్లు వచ్చాయి. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.కృష్ణారావు, జనరల్ సెక్రటరీగా నోముల రాముడు, జాయింట్ సెక్రటరీగా ఇబ్రహీం షరీఫ్, ట్రెజరర్‌గా జి.సీతారామరాజు, లైబ్రరీ సెక్రటరీగా కె.కృష్ణకిషోర్‌లు కోనే సీతారామారావు ప్యానల్ నుంచి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి అల్లినేని విజయ్‌కుమార్ ప్యానల్ నుంచి మహిళా రిప్రజెంటేటివ్‌గా పి.కనకదుర్గాభవాని, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా జి.విజయభాస్కర్ ఎన్నికయ్యారు.

చినుకు రాలదు.. సాగు సాగదు..!

వర్షాభావంతో మందకొడిగా సార్వా పనులు
జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే అవకాశం

ప్రజాశక్తి - కాళ్ల

సార్వా సీజన్ ప్రారంభంలోనే రైతులను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. రుతుపవనాలు ముందుగా వచ్చినా వర్షాలు సరిగా కురవకపోవడంతో సార్వా సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. జూన్ ఒకటో తేదీన కాల్వలకు నీరు వదిలారు. సాధారణంగా జూన్ నెలాఖరు నాటికే నారుమళ్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే వర్షాలు కురవకపోవడం, కాల్వలకు నీరు వదిలినా మరమ్మతులు, ఇతర పేర్లతో పూర్తిస్థాయిలో నీరు దిగువకు విడుదల చేయకపోవడంతో దుక్కులు సైతం చేయలేని పరిస్థితి ఏర్పడింది.



నారుమడి వేసేందుకు కారెం సాయంతో నీటిని తోడుతున్న రైతు

జిల్లాలో రైతులు జులై మూడో వారంలోగా వరి నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. జూన్ చివరి నాటికి నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసి, జులై మూడో వారం నాటికి నాట్లు పూర్తి చేస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో లక్షా 50 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఈ మేరకు పశ్చిమలో 37,500 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 1500 ఎకరాల్లోనే నారుమడుల ప్రక్రియ పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సాగులో సన్న రకాలను ప్రోత్సహించేందుకు ఎంటియు 1262 రకం విత్తనాలను అన్ని మండలాల్లో దాదాపు 125 ఎకరాల్లో విత్తన పంటగా వేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. 50 శాతం సబ్సిడీపై ఈ విత్తనాలు అందిస్తున్నారు.



నారుమడి కోసం దమ్ము చేస్తున్న ట్రాక్టర్

వరిసాగులో నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించడానికి జిల్లావ్యాప్తంగా మూడు లక్షల ఎకరాలకు అవసరమైన నానో యూరియా, డిఎపి ప్రయివేటు మార్కెట్లో అందుబాటులో ఉంచారు.

భూసారాన్ని బట్టి ఎరువులను వాడాలి

అధికంగా ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి రైతులకు భూసార పరీక్షల కార్డులు అందిస్తున్నారు. ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. దీనిలో భాగంగా గతేడాది 16,205 మట్టి నమూనాలు సేకరించారు. ఈ ఏడాది 22,500 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు. వ్యవ సాయ భూముల్లో నత్రజని, కార్బన్, జింకు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. ఈ మేరకు రైతులకు భూసార పరీక్షలు కార్డులు అందించి వాటి ఆధారంగా ఎరువులు వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

ముందస్తు నాట్లు మేలు

జడ్.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం



సార్వా సాగులో వీలైనంత త్వరగా ముందస్తు నాట్లు వేయడం వల్ల మంచి దిగుబడులు సాధించొచ్చు. ఇప్పటికే పంట కాల్వల్లో సమృద్ధిగా నీరు ఉంది. రైతుల త్వరిత గతిన నారుమడులు వేయాలి. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లోనే నారుమడులు పూర్తయ్యాయి. విత్తనాలు, అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జులై మూడో వారం నాటికి నాట్లు ప్రక్రియ పూర్తి చేస్తే నవంబర్, డిసెంబర్‌లలో సంభవించే తుఫాన్ల వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

ఘనంగా యోగాంధ్ర

5,617 ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు : కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శనివారం స్థానిక సిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్ఎలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు విచ్చేశారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన వాణి శివప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో ప్రధాని, సిఎం ప్రసంగాలను వారు తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 5,617 ప్రాంతాల్లో యోగా అభ్యాసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో తొమ్మిది లక్షల 59 వేల 635 మంది రిజిస్టర్ చేసుకున్నారన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాదరావు, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఎపిసి పంకజ్ కుమార్, ఆర్ఎంఆర్, మేతర అజయ్, ఆయుష్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి శారద, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



యోగాంధ్రలో జెడ్‌పి ఛైర్‌పర్సన్, కలెక్టర్, జెసి

పది గంటల పని ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, రాత్రివేళల్లో మహిళలతో పని చేయించుకోవడానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనుసన్నల్లోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో వేగంగా అమలు చేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే కూటమి ప్రభుత్వం కార్మికుల 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ జిఒ జారీ చేసిందన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు పని చేయవచ్చునని మార్పులు చేశారని తెలిపారు. మహిళలకు పట్టపగలే రక్షణ లేకుంటే, రాత్రి సమయాల్లో రక్షణ ఎక్కడ ఉంటుందని వారు ప్రశ్నించారు. తక్షణమే 10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాలు ఐక్యంగా ఆందోళన ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, నాయకులు పి.కిషోర్, కడుపు కన్నయ్య, బుగత జగన్నాథం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి గడసాల రాంబాబు, ముంగం అప్పారావు, కాకర్ల శ్రీను, మజ్జి శ్రీను, జి.రమణ, టి.నూకరాజు, అన్నవరం, సిహెచ్.నాగేశ్వరరావు, సత్తిబాబు, మురళీ, ఈశ్వరరావు, గిరిబాబు, సిఐటియు నాయకులు వివిఎన్.ప్రసాద్, కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాక్, జె.గోపి, సీతయ్య, మొహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నాచేస్తున్న నేతలు

రైతుల సమస్యలపై స్పందిస్తాం

పంటల నాణ్యతపై దృష్టి పెట్టాలి
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - పెదవేగి

జిల్లాలో రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందిస్తుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శనివారం మండలంలోని కొండలరావుపాలెం రైతు రంగోల పాండురంగారావు కోకో కొనుగోలు ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోకో బస్తాలను స్వయంగా కలెక్టర్ కాటా వేసి తూకాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్, కోకో పంటలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తున్నారని తెలిపారు. ఈ నెల 30వ తేదీ నాటికి కోకో గింజల కొనుగోలు సంపూర్ణంగా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు కొబ్బరి తోటల్లోనే కోకో సాగు ఉండేదని, ఇక నుండి పామాయిల్ తోటల్లోనూ కోకో పండించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. చిన్న రైతులకు కోకో ఎండ పెట్టుకోవడానికి టార్పాలిన్లు, సిమెంటు ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పెద్ద రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఫాలీ డ్రైయర్స్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలపై రైతులు ప్రత్యేక దృష్టి పెడితే ప్రయివేటు ఏజెన్సీలు కూడా కొనుగోలుకు ముందుకొస్తాయన్నారు. కోకో, పామాయిల్ సాగులో మన జిల్లా జాతీయస్థాయిలో మొదటి స్థానంలో ఉందని, మిగిలిన పంటలు కూడా అదే స్థానంలో నిలిచేలా సంబంధిత అధికారులు, రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్, మండల ఉద్యాన శాఖాధికారి ఎం.రత్నమాల, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, కోకో రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్బంధ పద్ధతులకు పాల్పడొద్దు

బిజెపి సమావేశానికి ఉపాధి హామీ కూలీల తరలింపు
రాకపోతే మస్తరు వేయబోమని బెదిరించడం తగదు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌లో బిజెపి సమావేశానికి ఉపాధి హామీ కూలీలను తరలించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా ఖండించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు కన్నాపురంలో జరిగే శిక్షణ తరగతుల సన్నాహాలు సమీక్ష చేస్తూ పార్టీ మండల నాయకులు దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశ నిర్ణయాలను పార్టీ మండల ఆర్గనైజర్ ఎస్.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బిజెపి సమావేశానికి ఉపాధి కూలీలను సుమారు 200 మందికి పైనే హాజరు పరిచారన్నారు. ముందురోజు రాత్రి రేపు ఉదయం ఉపాధి హామీ పని లేదని, మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఉంటుదని, యోగా కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు తపనచౌదరి పాల్గొంటున్నారని, ఈ సమావేశానికి వచ్చిన కూలీలకే మస్టర్ వేస్తామని, రానివారికి వేయబోమని బెదిరించడంతో కూలీలందరూ వెళ్లారన్నారు. అందరికీ బిజెపి కరపత్రాలు పంపిణీ చేసి బిజెపి పార్టీ కండువాలు ప్రతి మనిషికి ఇచ్చి మెడలో వేసుకోమన్నారని, ఇష్టం లేకపోయినా బలవంతంగా వేయించారని చెప్పారు. సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని, పార్టీ సమావేశాల కోసం ఇంతటి హీనమైన చర్యలకు పాల్పడటం ధర్మమా ప్రశ్నించారు. ఈ చర్యలకు పాల్పడిన బిజెపి నాయకులపై, అధికారులపై తగిన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 21వ తేదీ యోగా డే కార్యక్రమానికి కూడా ముందురోజు రాత్రి ఫోన్ చేసి ఉపాధి కూలీలకు రేపు పని లేదని, ఉదయం ఏడు గంటల నుంచి నుండి యోగా కార్యక్రమం ఉంటుందని, అందరూ కలిసి కొయ్యలగూడెం హైస్కూల్ గ్రౌండ్‌కు రావాలని ఉపాధి కూలీలకు చెప్పారన్నారు. వచ్చిన వారికే ఉపాధి కూలీ మస్తర్లు వేస్తామని, రానివారికి వేయబోమని చెప్పి బెదిరింపు చర్యలకు పాల్పడడాన్ని ఖండిస్తున్నామన్నారు. వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా చేయాల్సిన వ్యాయామాలను ఈ రకంగా నిర్బంధ పద్ధతిలో చేయించడం తగదన్నారు. ఉపాధి కూలీల ఆర్థిక నిస్సహాయతను ఆధారం చేసుకుని ఇలాంటి తప్పుడు చర్యలు తగవన్నారు. ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులు మానుకుని ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఇటువంటి నిర్బంధ పద్ధతులకు పాల్పడవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు కె.సీతారాముడు, ఎస్.శివకుమార్, ఎస్.దుర్గారావు, పూణెం అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

నీటివనరులు కలుషితం కాకుండా చర్యలు

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలోని కాలువలు, నీటివనరులు వ్యర్థాలతో కలుషితం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌ను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని కాలువలు, నీటివనరుల వద్ద పారిశుధ్య పరిస్థితులను శనివారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని తమ్మిలేరు గట్లను కలెక్టర్ పరిశీలించారు. తమ్మిలేరు గట్లకు ఇరువైపులా కొబ్బరిబొండాలు, హోటళ్ల వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉండడంపై మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై చెత్తను వేసే కళ్యాణమండపాల యజమానులు, మార్కెట్లు, హోటల్స్, రెస్టారెంట్లు, వాణిజ్య దుకాణాదారులు, ప్రజలకు నోటీసులు జారీ చేసి, పెనాల్టీలు విధించాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి ప్రధాన కూడలిలో అందరికీ తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. తాను నగరంలో పారిశుధ్య పరిస్థితులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, రోడ్లపై ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత పారిశుధ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోడూరు విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

'మా స్కూలు.. మాకు కావాలి..!" అనే శీర్షికతో ప్రజాశక్తి దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముదినేపల్లి విద్యాశాఖాదికారి-1 కోడూరు ఎంపియుపి స్కూల్‌లో 6,7,8 తరగతులను డీగ్రేడ్ చేసి ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న పెదపాలపర్రు జెడ్‌పి హైస్కూల్, ముదినేపల్లి జెడ్‌పి హైస్కూళ్లలో కలిపారు. కోడూరు యుపి పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు గ్రామస్తులను అప్పుడు జరిగిన సమావేశంలో ఈ పాఠశాలను డీ గ్రేడ్ చేస్తున్నామని చెప్పినప్పుడు అందరూ అంగీకారం తెలిపారన్నారు. ఇప్పుడు పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, గ్రామస్తులు అప్పుడు తమకు అర్థం కాలేదని, ఇప్పుడు మా పిల్లలు అంత దూరం వెళ్లలేరని, మా పాఠశాల మాకే కావాలి అని అడుగుతున్నారని తెలిపారు. ఈ విషయమై కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ముదినేపల్లి ఎంఇఒను ఫోన్‌లో వివరణ కోరారని, పాఠశాల పరిస్థితిని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు ఎంఇఒ నరేష్ కుమార్ వివరించారన్నారు. ఈ విషయంపై స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌తో మాట్లాడుతానని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ చెప్పినట్లు ముదినేపల్లి ఎంఇఒ తెలిపారన్నారు. శనివారం ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి నరేష్‌కుమార్ మరోసారి కోడూరు గ్రామస్తులతో, ఎస్ఎంసి కమిటీ సభ్యులతో మాట్లాడి పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు వివరణ ఇచ్చారు.

వెంబడించి.. కత్తులతో నరికి

సోమవరప్పాడు శివారులో నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య
పాతకక్షలే కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
పలు కేసుల్లో నిందితుడిగా మృతుడు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పాత కక్షల నేపథ్యంలో పట్టపగలు ఓ వ్యక్తిని సినీ ఫక్కీలో కారులో వెంబడించి అనంతరం కత్తులతో నరికి హత్య చేసిన ఘటన దెందులూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమవరప్పాడు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... నగరంలోని రెండో పట్టణ పరిధికి చెందిన మింగి ఎర్రబాబు శనివారం ఉదయం అతని స్నేహితుడైన సుధాకర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గోపన్నపాలెం వెళ్లి తిరిగి ఏలూరు బయలుదేరాడు. సుమారు 11 గంటల సమయంలో సోమవరప్పడు గ్రామ శివారుకు వచ్చేసరికి అతని వెనుకగా వచ్చిన ఒక కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు పక్కనే ఉన్న తుప్పల్లో పడ్డారు. సుధాకర్‌ని వదిలివేసిన దుండగులు ఎర్రబాబుపై దాడి చేస్తుండగా వారి నుంచి తప్పించుకునేందుకు ఎర్రబాబు పరుగులు తీశాడు. నలుగురు వ్యక్తులు ఎర్రబాబును వెంబడించి పట్టుకుని కత్తులతో పలుమార్లు అతని మెడపై నరికారు. దీంతో ఎర్రబాబు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన చూసిన స్థానికులు ఎక్కడి వారే అక్కడ పరారయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు ఎర్రబాబు రక్తపు మడుగులో అక్కడే పడి ఉన్నాడు. భయంతో అతని వద్దకు ఎవరూ రాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పెదవేగి సిఐ రాజశేఖర్, దెందులూరు ఎస్ఐ శివాజీ అతని బంధువుల వద్ద నుండి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.



పలు కేసుల్లో నిందితుడిగా మృతుడు

ఏలూరు పాముల దెబ్బకు చెందిన ఎర్రబాబు అనేక దొంగతనాల కేసుల్లో నిందితుడిగా, నేరస్తుడిగా ఉన్నాడు. నగరంలోనే కాకుండా జిల్లాలో పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతనిపై సస్పెక్ట్ షీట్ ఉంది. పలు కొట్లాట కేసుల్లో, గతంలో హత్యాయత్నం కేసులో కూడా నిందితుడిగా ఉన్నాడు. ఎర్రబాబు నివాసం ఉండే ప్రాంతంలోనే నివాసం ఉంటున్న దాసరి అశోక్ కుటుంబంతో ఎర్రబాబుకు చాలా కాలంగా తగాదా ఉంది. ఒకమారు ఈ రెండు కుటుంబాలు ఒకరిపై ఒకరు కత్తులతో, రాడ్లతో దాడికి తెగబడ్డారు. ఆ సందర్భంలో ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్నారు. ఈ గొడవలు జరిగిన తర్వాత కొన్ని రోజులపాటు ఎర్రబాబు ఏలూరును వదిలి అతని తాత ఇంటి వద్ద ఉన్నాడు. మళ్లీ తిరిగి ఏడాది క్రితం ఏలూరు నగరానికి వచ్చాడు. దాసరి కుటుంబానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించడతో అతనిపై పోక్సో కేసు నమోదైంది. రిమాండ్ అనంతరం ఏప్రిల్ పదో తేదీన అతను జైలు నుంచి విడుదలయ్యాడు. అప్పటి నుంచి ఎర్రబాబును హత్య చేసేందుకు పతకం రచిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేస్తున్నారు. ఎర్రబాబు హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

విన్యాసాలు.. సమస్యలు..!

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర పేరుతో పాలకులు, అధికారులు సాగించిన విన్యాసాలు ప్రజలకు ఎంతమేర ఆరోగ్యాన్ని చేకూర్చాయోగాని సమస్యలు మాత్రం పట్టిపీడిస్తున్నాయి. ఎందుకంటే యోగా దినోత్సవం రోజున ప్రధాని మోడీ విశాఖ పర్యటన ఖరారైనప్పటి నుంచి యోగాంధ్ర పేరిట ప్రతిచోటా యోగా విన్యాసాలు అధికారికంగానే నిర్వహించడం ప్రారంభించారు. గత రెండు వారాలుగా అయితే రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం మొత్తం పనులన్నీ పక్కనబెట్టి యోగాంధ్ర నిర్వహణపైనే దృష్టి పెట్టాయి. రెండు జిల్లాల్లో ప్రతిసోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌ను ఒక వారం పూర్తిగా రద్దు చేశారంటే జిల్లా అధికారులు యోగాంధ్రపై ఏస్థాయిలో కేంద్రీకరించారో అర్థం చేసుకోవచ్చు. యోగా విన్యాసాలపై కేంద్రీకరించిన జిల్లా అధికారులు సైతం ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ప్రధానంగా విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల బాదుడు, విద్యా సామగ్రి అమ్మకాలు తదితర అంశాలపై ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, అటు విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నా ఇటు విద్యాశాఖగాని, అటు జిల్లా ఉన్నతాధికారులుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. పశ్చిమగోదావరిలో ఆ జిల్లా కలెక్టర్ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి నిబంధనల ఉల్లంఘనపై హెచ్చరికలు చేశారు. ఏలూరు జిల్లాలో కనీసం ఆ పరిస్థితీ లేకపోవడం గమనార్హం. దీంతో ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారం, బెల్టు, ఐడికార్డు, ఇతరాలు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగానే వసూళ్లు చేశాయి. విద్యార్థి సంఘాల నేతలు ఆయా స్కూళ్లకు వెళ్లి పరిస్థితిని గమనించి విద్యాశాఖాధికారులకు సమాచారం ఇచ్చినా రాతపూర్వకంగా ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం విద్యాశాఖలో నెలకొన్న అవినీతికి నిదర్శనమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక రేషన్‌లైజేషన్ పేరిట యుపి స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం తదితర సమస్యలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వేధిస్తున్నాయి. మండల కేంద్రమైన పెనుమంట్రలో



ఎల్ఇ స్కూల్ నుంచి సమీపంలోని మెయిన్ స్కూల్‌కు 3, 4, 5 తరగతులను తరలించడంతో 24 మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడింది. ఎందుకంటే అరకిలోమీటరు దూరంలోనే ఆ స్కూల్ ఉన్నా చిన్నారులు తాడేపల్లిగూడెం-మార్టేరు రాష్ట్రీయ రహదారి గుండా వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా మారింది. ఇదే పరిస్థితి ముదినేపల్లి మండలం కోడూరులో నెలకొంది. అక్కడ యుపి స్కూల్‌ను ప్రైమరీ స్కూల్‌గా మార్చడంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు మాత్రం యోగాసనాల్లో మునిగి తేలుతుండటం గమనార్హం.

ఇక తల్లికి వందనం సొమ్ము రాక తల్లులు విద్యుత్ శాఖ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధం లేని కారణాలతో తల్లికి వందనం సొమ్ము జమ చేయకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇక అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఆందోళనలు చేపట్టారు. అంటే ప్రభుత్వ పథకాలు చిరుద్యోగులకు సైతం కట్ చేశారని స్పష్టమవుతోంది. దీనిపై చెప్పుకోవడానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో చిరుద్యోగులు ఆయా కార్యాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలిచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కొల్లేరు విషయంలో సానుకూలత

కొల్లేరులో పరిస్థితుల అధ్యయనానికి విచ్చేసిన కేంద్ర సాధికార కమిటీ పర్యటన విషయంలో జిల్లా కలెక్టర్, అధికారులు మంచి కృషి చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజలు, ప్రజాసంఘాల నేతలు స్వేచ్ఛగా కమిటీకి వినతులిచ్చే అవకాశం కల్పించడంలో జిల్లా అధికారుల కృషి అభినందనీయం. తొలిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిటీ రెండో రోజు ఏలూరులోనే వినతుల స్వీకరణతోపాటు అధికారుల నుంచి సమగ్ర నివేదికలు కోరడం, ప్రజల ఆవేదనను సావధానంగా వినడం సానుకూలాంశాలుగా ఉన్నాయి. అందరి డిమాండ్ ఒకటే. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి జిరాయతీ, ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలనేది. గతంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీ అమలు చేసేలా చర్యలు చేపడితే చాలావరకూ సమస్య పరిష్కారమవుతోంది. ఆ దిశగా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చర్యలు చేపట్టేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది. మరి కొల్లేరు ప్రజల ఆశలు నెరవేరుతాయా, లేక అడియాశలుగా మిగిలిపోతాయా అనేది మరికొంత కాలం వేచిచూడక తప్పదు. ఏదేమైనా కొల్లేరు కమిటీ పర్యటన మినహా పాలనను, ప్రజా సమస్యలను పక్కన పెట్టి విన్యాసాలకు పరిమితమైన యంత్రాంగం ఇకనైనా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, ఎన్ని ముఖ్య కార్యక్రమాలొచ్చినా ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఒక ముఖ్యాంశంగా చూడాలని జనం కోరుతున్నారు.

-వివిఎస్‌వి.ప్రసాద్

డ్వాక్రా మహిళలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక యుబిఐఫ్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు అవగాహనా సదస్సు ఎస్.నిర్మల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మండల ఎపిఎం రామారావు హాజరై మాట్లాడారు. డ్వాక్రా పొదుపు సంఘాలు ప్రారంభమై ఈ నెల ఎనిమిదో తేదీ నాటికి 25 ఏళ్ల పూర్తయ్యాయని చెప్పారు. డ్వాక్రా మహిళలు దినదినాభివృద్ధిగా ఎదగడానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ రుణాలతో డ్వాక్రా మహిళలు చిన్నచిన్న పరిశ్రమలు, పచ్చళ్లు, చిన్న కిరణకొట్టు తదితరాలు పెట్టుకుని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉపయోగపడుతుందని. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, విఒఎ ఆర్‌పి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి మాట్లాడుతూ పథకాలు ఎంతవరకు అమలవుతున్నాయో అవగాహన లేక చాలా నష్ట పోతున్నారన్నారు. బిఓసి వడ్డీల గురించి బ్యాంకులు తెలియజేయడంలేదని తెలిపారు. బ్యాంకుల నుంచి లింకేజ్ లోన్లు తీసుకునే సందర్భంగా అనేక ఛార్జీల పేర్లతో భారం వేస్తున్నారన్నారు. సభ్యులు అవసరాల నిమిత్తం ప్రయివేట్ ఫైనాన్స్ వద్ద అప్పులు తీసుకుని వాటి వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. డ్వాక్రా మహిళలను అన్ని బ్యాంకులు వారు గౌరవించాలని, సున్నా వడ్డీ ప్రభుత్వ డ్వాక్రా గ్రూపులకు పూర్తిగా వర్తించాలని చెప్పారు. డ్వాక్రా యానిమేటర్లకు, ఆర్‌పిలకు పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, సిఐటియు జిల్లా నాయకులు పి.సూర్యారావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చంటి, డ్వాక్రా మహిళలు వై.సీతమ్మ, జి.కృష్ణవేణి, టి.ప్రేమకుమారి, పొట్ల సీతమ్మ, జగరపరం సత్యవతి, పెట్ల మంగమ్మ, ఎస్‌కె.సబిన, మానికొండ కుమారి, తనిక లక్ష్మి, దొమ్మేటి వాణి, పిల్లి అమల పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

తొలగిన చెత్త కుప్పలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రోడ్డు పక్కన చెత్త కుప్పలను డ్రెయినేజీల నుంచి తీసిన పూడికను అధికారులు తొలగించారు. నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పీజీ కాలేజీ రోడ్డులో ఉన్న డ్రెయినేజీలోని తీసిన పూడికను చెత్త కుప్పలను రోజులు గడచినా తొలగించకపోవడంపై ఈ నెల 19వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం ట్రాక్టర్ ద్వారా రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించారు. కథనం ప్రచురించి అధికారులు చెత్తకుప్పలను తొలగించేలా కృషి చేసిన ప్రజాశక్తికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


పూడిక కుప్పలను తొలగిస్తున్న సిబ్బంది

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి ముందస్తు సమాచారం లేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పలు శాఖలకు సంబంధించిన అధికారులు వివరించారు. అనంతరం ఎంపిపి కొర్స సోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు కలిసి కట్టుగా మండల సమస్యలపై దృష్టి పెట్టి మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, ఎంఇఒ కె.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్, ఎపిఎం యూన్స్, ఎపిఒ జాన్ వెస్లీ, ఎంపిటిసిలు సున్నం సురేష్, నాలి శ్రీను, కొన్ని శాఖల అధికారులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

20 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం రాత్రి వీచిన భీకర గాలికి విద్యుత్ తీగలపై చెట్టు కూలింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఈ కారణంగా శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి అంబేద్కర్ నగర్‌లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం విద్యుత్ సిబ్బంది వచ్చి తీగలపై పడ్డ చెట్టును యంత్రాలతో కట్ చేసి తొలగించారు. విద్యుత్ స్తంభం కూడా విరిగిపోవడంతో దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు రాత్రి ఏడు గంటలకు విద్యుత్తును పునరుద్ధరించారు. సుమారు 20 గంటల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో అంబేద్కర్ కాలనీవాసులు, పిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడ్డారు.

జాయింట్ ఎల్‌పిఎంల సబ్ డివిజన్ కోసం ప్రత్యేక డ్రైవ్

కొయ్యలగూడెం :మండలంలో జాయింట్ (ల్యాండ్ పట్టాదార్ మెమో)లను వ్యక్తిగత ల్యాండ్ పట్టాదార్ మెమోలుగా విభజించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. మండలంలోని ఆరు సబ్-సర్వే జరిగిన గ్రామాల్లో 2,677 జాయింట్ ల్యాండ్ పట్టాదార్ మెమో పట్టాదారులను గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 30లోపు ఈ విభజన ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జాయింట్ ల్యాండ్ పట్టాదార్ మెమో కలిగిన రైతులు తమ భూమి రికార్డులతో గ్రామ రెవెన్యూ అధికారి లేదా గ్రామ సర్వేయర్‌ను సంప్రదించి, వ్యక్తిగత ల్యాండ్ పట్టాదార్ మెమోలో తమ పేరును వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారులకు దిశానిర్దేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - చింతలపూడి

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి నగర పంచాయతీలో భాగమైన గడ్డం శాంతకుమార్ నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎస్‌ఐ సతీష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శాంతకుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలులో ప్రయాణిస్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన అల్లూరి సత్యనారాయణ (69) రైలు బండిలో ప్రయాణిస్తున్నాడు. సరిగ్గా భీమడోలు రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకునే సరికి రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో అనధికార మద్యం విక్రయిస్తున్న సిద్ధార్థ నగర్ తండాకు చెందిన భూక్యా జగపతి వద్ద 46 మద్యం సీసాలు, మర్రిబంద గ్రామానికి చెందిన ఎర్రపోతుల లక్ష్మణ వద్ద 17 మద్యం సీసాలు, లంకపల్లి దుర్గారావు వద్ద పది మద్యం సీసాలు, వెలివెల నాగరాజు వద్ద పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

ఎల్‌ఎన్‌డి పేట పిహెచ్‌సి వైద్యురాలు సుష్మ

ప్రజాశక్తి - పోలవరం

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌ఎన్‌డి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తిరువీధుల సుష్మ అన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.



చిట్ చాట్

ప్రశ్న : రోజు ఎంత ఒపి ఉంటుంది, ఏఏ ప్రాంతాల నుంచి రోగులు వస్తారు?

వైద్యురాలు : పగలు 80 ఒపిలు, రాత్రులు 50 ఒపిలు ఉంటాయి. ఎల్‌ఎన్‌డి పేట, కుంకాల, జిల్లేలగూడెం, పెద్రాల, రామనరసాపురం, చేగొండపల్లి, సింగన్నపల్లి, తల్లవరం గ్రామాల నుంచి రోగులు వస్తుంటారు.

ప్రశ్న : మండలంలో డెంగీ, మలేరియా కేసులు ఎన్ని నమోదయ్యాయి?

వైద్యురాలు : డెంగీ కేసులు ఏమీ లేవు. మలేరియా రోజుకు మూడు నుంచి నాలుగు కేసులు వస్తున్నాయి. వారికి చికిత్స ఇస్తున్నాము. వాటిని ఎదుర్కొనేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : పిహెచ్‌సిలో మందుల కొరత ఉందా?

వైద్యురాలు : మందుల కొరత లేదు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : మండలంలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి?

వైద్యురాలు : జిల్లేలగూడెం, గూటాల-1, గూటాల-2, ప్రగడపల్లి, పెద్రాల, రేపల్లివాడ, చేగొండపల్లి, సింగన్నపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది సబ్ సెంటర్లు ఉన్నాయి.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యురాలు : వర్షాకాలం వచ్చేటప్పటికి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వర్షాకాలంలో దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలి. కొండలకు, బయటకు వెళ్లేటప్పుడు పొడుగు చేతుల బట్టలు వేసుకోవాలి. జ్వరం వచ్చినప్పుడు నాటు వైద్యం వాడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్ని సంప్రదించాలి.

ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిత్యం ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, రావిచెర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రావిచర్లలో శనివారం అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యోగాంధ్రా కార్యక్రమంలో సబ్ కలెక్టర్, గ్రామ సర్పంచి, ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్, తహశీల్దార్ బద్రు నాయక్, గ్రామ ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాపా మహేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏలూరు : ఏలూరు బాలల గ్రంథాలయం ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారంశెట్టి రమేష్ బాబు యోగా వల్ల కలిగే బహుళ ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోగు నరసింహారావు, మధ్యాహ్నపు పద్మనాభరావు, వర్రె కొండలరావు కార్యక్రమంలో పాల్గొన్నవారికి స్నాక్స్ పంచిపెట్టారు.

ముదినేపల్లి : మండల వ్యాప్తంగా యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లి, వైవాక, పెదపాలపర్రు, అల్లూరు తదితర గ్రామాల్లో యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కైకమ్మతో పాటు తహశీల్దార్ షేక్ లతీఫ్ భాషా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఐటిఐ కళాశాల, లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఇండోసాక్సన్ తదితర ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో కె.సత్యనారాయణ, సిహెచ్.నితిన్, ఎంజె.జార్జి, సర్పంచులు గంట రాకేష్ కుమార్, పద్మావతి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడిలో నిర్వహించిన


ముదినేపల్లిలో...

యోగా కార్యక్రమంలో ఎంఇఒ కిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు కొంతసేపు యోగా చేయాలన్నారు.

జీలుగుమిల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమ లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. దర్భగూడెం సచివాలయం పరిధిలో సర్పంచి సున్నం ఉషారాణి ఆధ్వర్యంలో యోగా చేశారు. పి.అంకంపాలెంలో ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను ఆధ్వర్యంలో చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, ఎంఇఒలు శ్రీనివాస్, బుచ్చయ్య, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగా దినోత్సవం వేడుకలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మరీదు మనోహర్ మాట్లాడారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంపిడిఒ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చిటికెన రమేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం హైస్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, కూటమి నాయకులు, రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి పాల్గొన్నారు.

మండవల్లి : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ తెలిపారు. కానుకొల్లు సచివాలయం, మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో, సిబ్బందితో శనివారం యోగాసనాలు వేశారు.

ఈ కార్యక్రమంలో మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కార్యదర్శి ముద్దునేని కొండలు, సిఐటియు నాయకులు రాయగిరి రాము, ముళ్లపూడి సత్తిబాబు, అడపా జానీ, గుడివాడ మురళి పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సచివాలయాలు, హైస్కూళ్లు, మోడల్ స్కూళ్లల్లో, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ కె.వెంకటరమణ, గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు డి.శైలజ, మండల విద్యాశాఖాధికారి బివిఎస్.సుబ్బారావు, సర్పంచులు కొండేటి విజయలక్ష్మి బాబీ, గద్దల సుహాసిని మోహనరావు, పులి బళ్ల లక్ష్మీ సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దేవినేని డలరామ్, మెదరమెట్ల సురేంద్ర, ఎస్ఎంసి నక్క యోహాన్, ఎస్.పంగిడియ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో తహశీల్దార్ సాయిరాజు, ఎంపిడిఒ శ్రీనివాస్‌బాబు, యోగా మాస్టర్ డాక్టర్ విజయబాబులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.సజిని మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీలలో, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. పోలవరం కళాశాలలో జరిగిన యోగాలో అన్ని ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక నాయకులు, అధికారులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుంటం స్వర్ణలత, టిడిపి సీనియర్ నాయకులు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, సీనియర్ నాయకులు ఇమ్మడి రత్నాజీ, మండల యువ నాయకులు మొగతడకల ఓం ప్రకాష్ చౌదరి పాల్గొన్నారు.

పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలి

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ

ద్వారకాతిరుమల బాలికల గురుకులం సందర్శన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల బాలికల గురుకులంలో భోజన వసతి అమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ శనివారం పరిశీలించారు. గురుకులంలో ఉంటున్న పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినుల సంఖ్య తదితర వివరాలు ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. సరుకు నిల్వ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వంటశాలకు చేరుకుని అక్కడి వసతులను, వంటకాలను పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. నీటి శుద్ధి యంత్రం పని తీరు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో విడివిడిగా ముచ్చటించి పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని, చదువులో రాణిస్తారన్నారు. ప్రతి విద్యార్థి తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని, అమలులో ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు విజయకృష్ణ సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

అన్ని వివరాలతో నివేదికను కలెక్టర్‌కి అందిస్తామని తెలిపారు.

దేశంలోనే ప్రథమంగా యాక్షన్ టెసా ప్యానల్ పరిశ్రమ

డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వై.జనార్ధన్‌రెడ్డి

ఏలూరు సిటీ : యాక్షన్ టెసా కంపెనీ భారత దేశంలో నెంబర్ వన్ ప్యానల్ పరిశ్రమ అని డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వై.జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఏలూరులోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కుబేర హోటల్‌లో కార్పెంటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ టెసా సలాం అనే నినాదంతో కార్పెంటర్లను గౌరవించడానికి కంపెనీ చేపట్టిన గొప్ప కార్యక్రమమన్నారు. అనంతరం యాక్షన్ టెసా మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ అగర్వాల్ మాట్లాడుతూ కార్పెంటర్ల పట్ల తన ప్రగాఢమైన అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఇంజినీరింగ్‌లో చెక్క పరిశ్రమకు వడ్రంగులు వెన్నెముక అని వారి నైపుణ్యాలు, సృజనాత్మకతను గొప్ప స్థాయిలో జరుపుకోవాలని తెలిపారు. కార్పెంటర్స్ దినోత్సవం మరింత అర్థవంతంగా నిర్వహించేందుకు కొత్త మార్గలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాక్షన్ టెసా తన సరికొత్త నివాళి, టెసా సలాం పేరుతో ఒక వీడియోని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ టెసా కంపెనీ అధికారిక పంపిణీదారు గోపీకృష్ణ, ప్లైవుడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఓలేటి శ్రీనివాసరావు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ కంచెటి ప్రసాద్, వడ్రంగులు పాల్గొన్నారు.

శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మెడికల్ కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి ఎదుట చేపట్టిన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటరీ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వేతనాలు ఇవ్వడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను పాల్గొన్నారు.

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా, కొవ్వూరు

I.A. No. 998/2024 in

A.S. No. /2024

Between:

Vagu Sathyavathi ...**Petitoner**

AND

1: Jayavarapu Rama Durga Rao, S/o. V.B.V.Appa Rao, Hindu, Male, age 74, Business, R/o. H.No. 24A-1-18/1, Pathebad, Near Vinayaka Temple, Eluru.

2: Jayavarapu Praveen, S/o. Ram Durga Rao, Hindu, Male, age 40, Business, R/o. H.No. 24A-1-18/1, Pathebad, Near Vinayaka Temple, Eluru.

3: Bhuthapalli Srilakshmi, W/o. Nicolus, Hindu, Female, age 42, Business, R/o. H.No. 24A-1-18/1, Pathebad, Near Vinayaka Temple, Eluru.

4: Pinnelli Vijaya Raju, S/o. Narasayya, Hindu, Male, age 64, Business, R/o. H.No. 24/A-77-1, Bammere Pothanna Street, Eluru.

...**Respondents**

పై నెంబరు I.A. 998/2024 in Un Numbered A.S. /2024 పిటిషన్‌లో 1, 2, 3, 4 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా, రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీయొక్క ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తోట వేంకటేశ్వరరావు
కొలసాని కనకదుర్గ
తోట పవన్‌కళ్యాణ్

కొవ్వూరు అడ్వకేట్స్, కొవ్వూరు
21-6-2025 సెల్: 7396917878

కూలిన వంతెన రక్షణ గోడ

వాహనదారుల అవస్థలు

స్కూల్ బస్సులు వెళ్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి చిగురుకోట ప్రధాన రహదారి రుద్రవరం వద్ద కైకలూరు ఛానల్‌పై నిర్మించిన వంతెన రక్షణ గోడ కూలిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. వంతెన పైనుంచి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కైకలూరు ఛానల్‌పై అయ్యవారి రుద్రవరం వద్ద బ్రిటిష్‌ల కాలంలో వంతెన నిర్మించారు. వంతెన ఇరుకుగా ఉండడంతో సుమారు 25ఏళ్ల క్రితం అప్పటి కైకలూరు ఎంఎల్‌ఎ కీర్తిశేషులు ఎర్నేని రాజారామ్ చందర్ వంతెనను వెడల్పు చేయించి రక్షణ గోడలను నిర్మించారు. అయితే ఈ మధ్యకాలంలో మినుములు లోడుతో ఉన్న లారీ వంతెనను ఢీకొట్టడంతో రక్షణ గోడ పూర్తిగా విరిగిపడిపోయింది. గ్రామస్తులు లారీని అడ్డగించినప్పటికీ ఇదిగో నిర్మిస్తా అదిగో నిర్మిస్తానంటూ సంవత్సరకాలం గడిచిపోయినప్పటికీ ప్రహరీ గోడ నిర్మాణం జరగలేదు. మండవల్లి నుంచి ముదినేపల్లి మండలం చిగురుకోటకు ప్రధాని రహదారి కావడం రావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాఠశాల బస్సులతో పాటు అనేక వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. రక్షణ గోడ పడిపోవడంతో ఎక్కడ అదుపుతప్పి వాహనాలు కాలువలో పడిపోతాయేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలను నిర్మించి ప్రమాదాల నుంచి కాపాడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై అయ్యవారి రుద్రవరం సర్పంచి శేషగిరిని వివరణ కోరగా లారీ ఢీ కొనడంతో రక్షణ గోడ పడిపోయిన మాట వాస్తవమేనన్నారు. లారీ యజమాని నిర్మిస్తామని చెప్పాడన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, లేకపోతే పంచాయతీ ఆధ్వర్యంలో ప్రమాదాలను నివారించే విధంగా ఇనుప కడ్డీలతో రక్షణ వలయం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా ఉన్న వంతెన

నాన్ వెబ్ ల్యాండ్ డేటా ఎంట్రీతో రైతులకు సువర్ణావకాశం

ప్రజాశక్తి - కుక్కునూరు

అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.బాలాజీ రైతులకు పిలుపునిచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్ చేయని, చనిపోయిన రైతులు లేదా ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైన రైతుల కోసం నాన్-వెబ్ ల్యాండ్ డేటా ఎంట్రీ ఆప్షన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో సోమవారం సాయంత్రం లోపు సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి, గ్రామ వ్యవసాయ సహాయకుల సహాయంతో డేటా ఎంట్రీ పూర్తి చేయాలని, ఫైనల్ అప్రూవల్ కోసం మండల వ్యవసాయాధికారి లాగిన్‌కు ఒక రోజు సమయం కేటయిస్తారని తెలిపారు.

డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.ఆరు లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు వైసిపి ఎంపిపి గంజిమాల రామారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తుమ్మలపల్లి గంగరాజు, గ్రామ సర్పంచి అనంతలక్ష్మి, కొయ్యలగూడెం గ్రామపంచాయతీ పదో వార్డ్ సభ్యుడు పూలపల్లి రవికుమార్ వైసిపి నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఊత కర్రలు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

అక్కుపల్లి గోకవరానికి చెందిన వృద్ధుడు నూతలపాటి గాంధీ కాలికి ఇన్ఫెక్షన్ సోకడంతో ఒక కాలును వైద్యులు తొలగించారు. దీంతో నడవటానికి ఇబ్బందులు పడుతున్నాడు. మానవత సంస్థ పూర్వ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు ఆర్థిక సాయంతో చంక కర్రలను ఆదివారం అందించినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు కోనే సత్యనారాయణ వెల్లడించారు. మానవత సంస్థ ద్వారా త్వరలో కృత్రిమ కాలు, వీల్ ఛైర్‌ను అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపి, సర్పంచి మిద్దే సత్యవతి, కార్యదర్శి గంజి రవికుమార్, ఎంపిటిసి సభ్యురాలు దేవదాసు విజయనిర్మల పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీలో శనివారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహనా కల్పిస్తూ డస్ట్ బిన్‌లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా సర్పంచి మైగాపుల విజయదుర్గ మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్తను సక్రమంగా వేరు చేసి, పొడి చెత్తగా మార్చడం అనేది చాలా అవసరమన్నారు. దీంతో పర్యావరణం శుభ్రంగా ఉంటుందన్నారు. అనంతరం యోగాడే సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద యోగాసనాలు వేశారు.

నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.325/2011

బిట్వీన్ :

గోలిగోవిందరావు ...వాది

మరియు

కొరపాటి బాలరాజు వగైరా ...ప్రతివాద్లు

పై నెంబరు గ్రంథంలో 4,5,6 ప్రతివాదులయిన శ్రీమతి కొరపాటి మరియమ్మ W/o.Late బాలరాజు, 2.కొరపాటి సంతోష్ S/o.Late బాలరాజు, 3.కొరపాటి కీర్తి, D/o.Late బాలరాజు, గోపినాథపట్నం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా అను వారు కోర్టు వారి నోటీసులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ది.27-6-2025 సంవత్సరం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా కాని హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా యావన్మందికి తెలియ చేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
కాజ నాగేశ్వరరావు
ఏలూరు అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
తేది.20-6-25 ఫోన్: 99895 38628

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 299/2021

బిట్వీన్:

బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం
-వాది

అండ్

కడియం లక్ష్మి అండ్ అనదర్
ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:

D-1: కడియం లక్ష్మి, W/o. శ్రీను, డోర్ నెం. 34-5-34, (Near) మారుతీ థియేటర్, అంజయ్య స్ట్రీట్, పాలకొల్లు - 534260, ప॥గో॥జిల్లా.

మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 25-06-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 24-03-2025 సెల్: 98662 59514